
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

ఆదివారం 7 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : ఆదివారం సా : 6.35 గం.

సహర్ : సోమవారం ఉ : 4.42 గం.

షబ్-ఎ-ఖదర్ షాన్..!



మెదక్ జమా మసీదులో...

రంజాన్ మాసంలో ముఖ్యమైన షబ్-ఎ-ఖదర్‌ను శనివారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జగ్నేకీరాత్ సందదర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, రాత్రంతా జాగారం ఉన్నారు.

-మెదక్ కల్చరల్



పూర్ణాహుతి చేస్తున్న రుత్వికులు

కోలాహలంగా రథోత్సవం

గుమ్మడిదల మండలం బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున రథోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-గుమ్మడిదల



వీరభద్రుడి రథాన్ని లాగుతున్న భక్తులు



సంగారెడ్డి మండలం హనుమాన్‌గర్‌లో మట్టితో కృత్రిమ ఇసుకను తయారుచేస్తున్న దృశ్యం

ఆగని దందా!

- హనుమాన్‌నగర్‌లో కృత్రిమ ఇసుక తయారీ
- ట్రాక్టర్లు సీజ్ చేసినా వెనక్కి తగ్గని మాఫియా
- వట్‌పల్లి మండలంలో అసైన్డ్, పట్టా భూముల్లో మట్టి తవ్వకాలు
- రోడ్డు పేరుచెప్పి.. విక్రయం

మట్టి.. అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నది. అడ్డదారిలో కొందరు కృత్రిమ ఇసుకను తయారు చేస్తుండగా, మరోచోట అసైన్డ్, పట్టా భూములను తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు పట్టుకుంటే ఫైన్ కడితే సరి అన్నట్టు దందాను సాగిస్తుండటం విశేషం..!

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 6 : మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. టాస్క్‌ఫోర్స్ దాడులు చేసినా.. ట్రాక్టర్లు సీజ్ చేసినా వెనుకడుగు వేయడం లేదు. ఇదివరకు రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా చేసే దందాను ప్రస్తుతం పట్టపగలే కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి కూతవేటు దూరంలో ఉన్న హనుమాన్‌నగర్‌లో మట్టి తవ్వకాలు, కృత్రిమ ఇసుక దందా జోరుగా కొనసాగుతున్నది. హనుమాన్‌నగర్, దాసుగడ్డ తండాల్లోని ప్రభుత్వ భూముల్లో మట్టిని తరలించి జల్లెడపట్టి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. సంగారెడ్డి, హత్నూర, జిన్నారం, మేడ్చల్ జిల్లా బాచుపల్లి, బహదూర్‌పల్లి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.4వేల నుంచి రూ.5వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడిచేసి 13 ట్రాక్టర్లను సీజ్ చేశారు. కానీ చలానా కట్టించుకుని వదిలేస్తుండడంతో మరుసటి రోజు నుంచే దందా కొనసాగిస్తున్నారు. అదేచోట మళ్లీ మట్టిని ఫిల్టర్ చేసి కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. అధికారులు పట్టుకున్నా ఫైన్ కడితే వదిలేస్తారులే అనే ధీమాతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు

వట్‌పల్లి, ఏప్రిల్ 6: మండలంలో మట్టి మాఫియా ఆగడాలు పెరిగిపోయాయి. అధికారుల అనుమతులు లేకుండా.. యజమానుల సమ్మతి లేకుండానే అసైన్డ్ భూముల్లో మట్టిని కొల్లగొడుతున్నారు. రోడ్డు పనుల పేరిట మండల పరిధిలోని గొర్రెకల్ శివారులో అసైన్డ్ భూములు, పట్టా భూముల నుంచి మట్టిని తరలిస్తున్నారు. రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. రోడ్డు పేరిట తవ్వి బయటి వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనివెనుక కొందరు నాయకుల హస్తం ఉన్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూముల్లో తవ్వకాలపై అసైన్డ్‌దారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో, రెండ్రోజుల క్రితం రెవెన్యూ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మట్టి తరలింపును అడ్డుకున్నారు. దీంతో కొందరు నాయకులు చేరుకుని రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి దిగారు.

మంత్రి సీరియస్ అయినా..

నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ అక్రమ మైనింగ్ దందాలపై సీరియస్‌గా ఉన్న విషయం తెలిసిందే. దీనిపై జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహించి అధికారులకు ఆదేశాలిస్తున్నారు. దీంతో, జిల్లాలో పలుచోట్ల అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట పడింది. కానీ, ఆయన సొంత నియోజకవర్గంలోనే మట్టి తవ్వకాలు జరగడం విమర్శలకు తావిస్తున్నది. మట్టి దందా చేసేవారు మంత్రి పేరు చెప్పి అధికారులను బెదిరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి మట్టి తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

ఇసుక దందాపై ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వినా, కృత్రిమ ఇసుకను తయారు చేసినా నేరమే. ఒకట్రెండుసార్లు హెచ్చరించి, ఫైన్ వేసి వదిలేస్తాం. మళ్లీ మళ్లీ పట్టుబడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

-దేవదాస్, సంగారెడ్డి తహసీల్దార్



గొర్రెకల్‌లో మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్



మట్టి తరలింపును అడ్డుకుంటున్న పోలీసులు(ఫైల్)

కాంగ్రెస్, బీజేపీ.. దొందూ దొందే

- రైతుల సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా?
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 6 : రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్, బీజేపీలు విస్మరించాయని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద నిర్వహించిన రైతుదీక్షకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. లక్షలాది ఎకరాల్లో పంట ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబంధు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు, వరికి రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరువు వచ్చిందని అన్నారు. కేసీఆర్ పాలనలో పంటలు పండితే.. కాంగ్రెస్ పాలనలో ఎండుతున్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సాగు నీరు, తాగునీరు లేక అల్లాడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, కంది జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీపీ కాల్వ సరళ, బీఆర్‌ఎస్ నాయకులు నరహరిరెడ్డి, బుచ్చిరెడ్డి, రాజేందర్, డాక్టర్ శ్రీహరి, రాజేశ్వర్‌రావు, గోవర్ధన్‌నాయక్, నగేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దే..

జహీరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైన విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.అబద్ధాల పునాదుల మీద ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అభద్రతా భావంతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఎరవేస్తున్నదని ఆరోపించారు. హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్తారని పేర్కొన్నారు. అనంతరం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ తాను కాంగ్రెస్‌లో చేరుతానని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీచైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మహ్మద్‌తన్వీర్, నరోత్తం, దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి రైతుదీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రతి ఇంటికీ తాగునీరు : రాహుల్‌రాజ్



లింగాపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్

నర్సాపూర్, ఏప్రిల్ 6: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని లింగాపూర్, రుస్తుంపేట గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. హత్నూర మండలం బోర్పట్ల సమీపంలోని వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమృద్ధిగా నీరు అందుబాటులో ఉన్నందున ప్రతీ ఇంటికి మిషన్‌భగీరథ ద్వారా శుద్ధిచేసిన నీటినే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్‌భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది షిఫ్టులవారీగా 24 గంటలు విధుల్లో ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఈఈలు కమలాకర్, సంపత్‌కుమార్, ఎంపీడీవో మధులత ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కౌడిపల్లి, ఏప్రిల్ 6: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహ్మద్‌నగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లడుతూ జిల్లావ్యాప్తంగా 410 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరుస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సరిపడా వాహనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్‌నాయక్, పీఏసీఎస్ ఈవో దుర్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారిణి భారతి హోలీకేరి
- సింగూరు నుంచి మంజీరా జలాల పంపిణీ : కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 6 : జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోలీకేరి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్, సంబంధితశాఖల అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. జనావాసాలకు ప్రతీరోజు తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు.. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సమస్యల తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ ద్వారా అందుతున్న నీటి సరఫరా వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నట్టు తెలిస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలని నిర్దేశించారు. ప్రతీ గ్రామపంచాయతీలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈల ఫోన్ నంబర్లను వాల్‌పోస్టర్ల ద్వారా ప్రదర్శించాలని, సమస్య వచ్చినప్పుడు ఫోన్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సింగూరు నుంచి నీటి సరఫరా

జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 26 మండలాలకు సింగూరు ప్రాజెక్టు నుంచి మంజీరా జలాలు అందజేస్తున్నామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోవాటర్‌వర్క్స్ ద్వారా తాగునీటిని సరఫరా చేసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడుతున్నారని వివరించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, పక్కన ప్రత్యేకాధికారి భారతి హోలీకేరి



ఎండ.. 42 డిగ్రీలు

సంగారెడ్డి, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా సదాశివపేట, కందిలో శనివారం 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లాలో గరిష్ఠంగా 41.3 డిగ్రీల ఉష్ణోగ్ర నమోదైంది. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా 27 డిగ్రీలు ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్నారు. ఎండల తీవ్రత తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

లెక్కలు ఖాయం.. మొక్కలు మాయం!

- రికార్డుల్లోనే పెరుగుతున్న మొక్కలు
- హరితహారం పేరిట రూ. కోట్లు గల్లంతు
- కనిపించని పచ్చదనం
- మురికి కుపాలుగా పట్టణ ప్రకృతి వనాలు



మినీట్యాంక్‌బండ్‌పై ఎండిపోయిన ఖరీదైన మొక్కలు



చెత్తాచెదారంతో నిండిపోయిన పట్టణ ప్రకృతివనం

సదాశివపేట, ఏప్రిల్ 6: కోట్ల రూపాయలు ఖర్చు చేసినా సదాశివపేట బల్దియాలో పచ్చదనం మచ్చుకయినా కనిపించడం లేదు. ఏటా పండుగలా నిర్వహించిన హరితహారంలో నాటిన లక్షలాది మొక్కలు ఎండిపోయాయి. పట్టణ ప్రకృతివనాలు, నర్సరీలు వెలవెలబోతున్నాయి. మొక్కలను సంరక్షించాల్సిన మున్సిపల్, అటవీశాఖల అధికారుల వైఫల్యం కారణంగా మొక్కలన్నీ ఎండిపోయాయి. గత పదేళ్లలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించి బల్దియా పరిధిలో నాటిన రకరకాల పండ్లు, పూలు, ఔషధ, టేకు మొక్కల ఆనవాళ్లు కూడా లేవు. మొక్కలకు రక్షణగా ఉంచిన ట్రీగార్డులు సైతం గల్లంతయ్యాయి. పార్కులు, నర్సరీలు, పట్టణ ప్రకృతివనాల్లో నాటిన మొక్కలు ఎండిపోయాయి. రహదారుల పక్కన, వీధుల్లో, ప్రభుత్వ స్థలాల్లో నాటిన మొక్కల జాడ లేదు. మినీట్యాంక్‌బండ్, పార్కుల్లో నాటిన వాటిలో 99 శాతం ఎండిపోయాయి.

నిధుల దుర్వినియోగం

సదాశివపేట పట్టణంలో 2020 నుంచి 2023 వరకు హరితహారం నిర్వహణ కోసం రూ.3.03 కోట్ల నిధులను ఖర్చు చేసినట్టు అధికారులు లెక్కలు చూపారు. ఈ నిధులతో బల్దియా పరిధిలో 1,00,430 మొక్కలను నాటినట్టు, మరో 1,20,940 మొక్కలను ప్రజలకు పంపిణీ చేసి, 35,043 మొక్కలను అందుబాటులో ఉంచినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం పట్టణంలో వందల సంఖ్యలో మొక్కలు కూడా పెరిగిన దాఖలాలు లేవు. హరితహారం లెక్కలన్నీ ఉత్తవేనని.. తప్పుడు రికార్డులతో రూ.2 కోట్ల మేర పక్కదారి పట్టించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కంపు కొడుతున్న ప్రకృతివనాలు

పట్టణంలో ప్రకృతివనాలు, క్రీడా ప్రాంగణాలు, నర్సరీలు మురికికూపాలుగా మారాయి. డ్రైనేజీ నీరు నిలిచి, చెత్తాచెదారం నిండిపోయి కంపుకొడుతున్నాయి. పూలు, పండ్ల మొక్కల స్థానంలో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. రూ.6 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసిన ఊబచెరువు కట్ట ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు నిండపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నాటిన ఖరీదైన మొక్కలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. పట్టణం నడిబొడ్డున రూ.25 లక్షలతో నిర్మించిన గాంధీ విగ్రహం సర్కిల్‌లో పచ్చదనం లేక, ఫౌంటెయిన్ పనిచేయక కళావిహీనంగా తయారయింది. అసలు పట్టణ పరిధిలో ఒక్క పార్కు కూడా లేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. పట్టణంలో తొలిసారి రూ. 2 కోట్లతో నిర్మించిన చిల్డ్రన్స్‌పార్కు రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. కొత్తగా వెలసిన వెంచర్లలో మున్సిపాలిటీకి కేటాయించిన 10 శాతం ఖాళీ స్థలాలు కూడా పార్కులు ఏర్పాటు చేయకపోవడంతో కబ్జాల పాలవుతున్నాయి. సదాశివపేట బల్దియాలో ప్రజలు సేదదీరుదామంటే పచ్చదనమే కనిపించకపోయినా.. కోట్లాది రూపాయల నిధులు మాత్రం ఖర్చయిపోవడం వెనుక మర్మమేమిటో తెలియాల్సి ఉన్నది.



డ్రైనేజీని తలపిస్తున్న క్రీడా ప్రాంగణం

కొల్చారం మండలంలో కవాతు

కొల్చారం, ఏప్రిల్ 6 : కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో పారా మిలటరీ బలగాలు, పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు కొల్చారం ఎస్ఐ మహ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో పోతంశెట్‌పల్లి చౌరస్తా, వెంకటాపూర్, కిష్టాపూర్, రాంపూర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

మల్లన్న భక్తులపై ఇదేం దురుసుతనం!

● సెల్‌ఫోన్, చెప్పుల స్టాండు నిర్వాహకుల దాడిపై ఆగ్రహం
● చర్యలు తీసుకోని ఆలయ వర్గాలు
● సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతున్న భక్తులు

చేర్యాల, ఏప్రిల్ 6 : కొమురవెల్లి మల్లన్న భక్తులపై పలువురు టెండర్‌దారుల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తుండడంతో నొచ్చుకుంటున్నారు. టెండర్ నిబంధనలు పాటించకపోగా, భక్తులపై దురుసుగా ప్రవర్తిస్తూ చేయిచేసుకుంటున్నా ఆలయ వర్గాలు చోద్యంచూస్తుండడం పట్ల మండిపడుతున్నారు. తమ మనోభావాలు దెబ్బతీస్తున్నా పట్టించుకోకపోవడం తగదంటూ వాపోతున్నారు. కొద్దిరోజుల క్రితం సెల్‌ఫోన్ భద్రపరిచే కౌంటర్ నిర్వాహకుడి సిబ్బంది భక్తులపై దాడికి పాల్పడగా, వారం క్రితం చెప్పులస్టాండు నిర్వాహకుడి సిబ్బంది భక్తులపై దాడి చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరుస దాడి ఘటనలు చోటుచేసుకుంటుండటం వివాదాస్పదమవుతుంది.

మల్లన్న ఆలయానికి యేటా లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో సెల్‌ఫోన్ డిపాజిట్‌తో పాటు చెప్పులు భద్రపరిచేందుకు టెండర్లు నిర్వహిస్తున్నారు. తద్వారా లక్షల్లో ఆదాయం సమకూరుతున్నప్పటికీ పలువురు సిబ్బంది దుర్వినియోగానికి పాల్పడుతూ భక్తులతో గలాటాకు దిగుతున్నారు. వారి తీరుపై ఫిర్యాదులు అందినా ఆలయ వర్గాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కౌంటర్ వద్దకు వచ్చిన భక్తుడి సెల్‌ఫోన్‌ను మాత్రమే డిపాజిట్ చేసి రశీదు అందివ్వాల్సి ఉండగా, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుని డిటెక్టర్లతో తనిఖీ చేయిస్తూ బలవంతంగా లాక్కుంటున్నారు. లేకుంటే దర్శనానికి పంపించకుండా అడ్డుకుంటున్నారు. ఫిబ్రవరి7న హన్మకొండ జిల్లాకు చెందిన భక్తులతో గొడవపడి దాడికి పాల్పడ్డారు. అలాగే చెప్పులస్టాండు నిర్వాహకుడు టెండర్ నిబంధనలకు విరుద్ధంగా లగేజీ బ్యాగులను అనధికారికంగా భద్రపరుచుకుంటూ డబ్బు వసూలు చేస్తుండటంతో పాటు ఆలయ పరిసరాలు, దుకాణాల ఆవరణలో విడిచిన చెప్పులను తీసుకువెళుతూ డబ్బు చెల్లిస్తేనే ఇస్తామని భక్తులతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారితో గొడవకు దిగడమే కాకుండా, గత శనివారం షాద్‌నగర్‌కు చెందిన ఇద్దరు భక్తులపై దాడిచేయడంతో గాయాలపాలయ్యారు. టెండర్ నిబంధనలు బేఖాతరు చేయడాన్ని కనీసం పట్టించుకోని ఆలయవర్గాలు భక్తులపై దాడులకు పాల్పడుతున్న విషయాన్ని విస్మరిస్తుండటం పట్ల ఆగ్రహం వెల్లుబికుతుంది. భక్తుల మనోభావాలకు భంగం కలిగించకుండా వ్యవహరిస్తున్నామని పాలకమండలి సభ్యులు చెబుతున్నా గాయపరిచే వరకు దారితీస్తుండటంపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈవో బాలాజీశర్మను వివరణ కోరగా భక్తులపట్ల దురుసుగా ప్రవర్తించకూడదని, టెండర్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.




మల్లన్న క్షేత్రంలోని దర్శన క్యూలైన్ వద్ద హన్మకొండ భక్తుడిపై దాడి చేస్తున్న సెల్‌ఫోన్ టెండర్‌దారుడి సిబ్బంది(ఫైల్), ఆలయ ఆవరణలోని చెప్పులస్టాండులో అనధికారికంగా లగేజీ బ్యాగులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు బాంచె మహేందర్ మృతదేహం

కొల్చారం, ఏప్రిల్ 6 : అప్పుల బాధతో రైతు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. వరిగుంతం గ్రామానికి చెందిన బాంచె మహేందర్(35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనకున్న రెండెకరాలలో పంట సాగు చేసేందుకు అప్పులు చేశాడు. నీళ్ల పారక పంట ఎండిపోయేసరికి తాగుడుకు బానిసయ్యాడు. అప్పు ఎలా తీర్చాలనే బాధతో శుక్రవారం రాత్రి భార్యాపిల్లలతో కలిసి భోజనం చేసి ఇంటి బయట వాకిట్లో పడుకున్నాడు. తెల్లవారుజామున ఇంటి ఎదుట ఉన్న రేకులషెడ్డులో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహేందర్‌కు భార్య సునీత, కూతురు, కుమారుడు ఉన్నారు. మహేందర్ తండ్రి బాంచె శంకరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమైందని ఉరేసుకున్న యువకుడు



భ్యాగరి ప్రశాంత్(ఫైల్)

మనోహరాబాద్, ఏప్రిల్ 6: ప్రేమించిన అమ్మాయి వేరే వారిని పెళ్లి చేసుకోవడంతో మనోవేదనకు గురైన యువకుడు ఉరేసుకోని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లకల్ గ్రామానికి చెందిన భ్యాగరి స్వామికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. శుక్రవారం తన కుటుంబసభ్యులు అందరూ కలసి అల్లిపూర్‌లో ఉన్న తన కూతురు వద్దకు దావత్ వెళ్లారు. కుమారుడు భ్యాగరి ప్రశాంత్(24) ఒక్కడే సాయత్రం తిరిగి కాళ్లకల్‌లోని తన ఇంటికి వచ్చాడు. వారి తల్లిదండ్రులు కూడా తిరిగి రాత్రి 10.30 గంటలకు సమాయనికి ఇంటికి వచ్చి చూడగా ప్రశాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబసభ్యులు స్థానికుల సహాయంతో ప్రశాంత్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రశాంత్ అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మేడ్చేల్ పట్టణంలో యువతిని ప్రేమించాడని, అమ్మాయి వేరే వారిని పెళ్లిచేసుకోవడంతో ఆ బాధ తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు తెలిపారు. తండ్రి భ్యాగరి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లి.. సింగూరు కాలువలో యువకుడి గల్లంతు

● నీరు నిలుపుదలతో మృతదేహం లభ్యం



వినోద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పుల్‌కల్, ఏప్రిల్ 6 : ఈత కోసం సింగూరు కాలువలో దిగిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మునిగి గల్లంతైన సంఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... బస్వాపూర్ గ్రామానికి చెందిన డప్పు విజయరావు, నీలమ్మ దంపతులకు వినీత్, వినోద్ ఇద్దరు కుమారులు. తండ్రి విజయరావు అనారోగ్యంతో మృతిచెందగా, వినోద్(22) సదాశివపేట సమీపంలోని ఎంఆర్‌ఎఫ్ టైర్ల పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఇంటి వద్దనే ఉన్న వినోద్ స్నేహితులతో కలిసి ఉదయం గ్రామ శివారులోని సింగూరు ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువలో ఈతకు వెళ్లారు. స్నేహితులంతా కాలువ నీటిలో ఈత కొడుతుండగా, వినోద్‌కు ఈత రాకపోవడంతో తెప్ప సహాయంతో నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో తెప్ప పక్కకు జారిపోవడంతో వినోద్ నీటిలో మునిగిపోయాడు. వినోద్‌ను రక్షించేందుకు తోటి స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నీటిలో గల్లంతుకావడంతో స్నేహితులు అతడి కోసం గాలింపు చేపట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. ఘటన విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయగా, వారు నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి సింగూరు ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నీటి ప్రవాహాన్ని నిలిపి వేయించారు. అనంతరం నీటి ప్రవాహం తగ్గడంతో స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు శ్రమించగా మునిగిపోయిన ప్రాంతానికి అర కిలోమీటరు దూరంలో మృతదేహం లభించింది. వినోద్ మృతదేహం ఒడ్డుకు చేర్చడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్‌ఐ కె.శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి



జాల నరేష్ మృతదేహం

వెల్దుర్తి, ఏప్రిల్ 6 : ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారు వద్ద శనివారం చోటుచేసుకున్నది. మృతుడి కుటుంబసభ్యులు తెలిసిన వివరాలు ప్రకారం.. మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి చెందిన జాల నరేష్(19) అదే గ్రామానికి చెందిన చిట్యాల యాదగౌడ్ కలిసి ట్రాక్టర్‌లో గడ్డిని తరలించి తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో హస్తాల్‌పూర్ వద్ద నరేష్ ఒక్కసారిగా ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. నరేష్ మృతదేహాన్ని రోడ్డుపక్కన పొలం వద్ద ఉన్న పూరి గుడిసెలో ఉంచి యాదగౌడ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఘటనా స్థలానికి వెల్దుర్తి పోలీసులు వెళ్లి పరిశీలించి నరేష్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నరేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు కూడా నిర్ధారించారు. నరేష్‌ను యాదగౌడ్ చంపిఉంటాడని, ఆయనను రక్షించడానికి పోలీసులు సహకరిస్తున్నారని మృతుడి తండ్రి గణేష్ ఆరోపించారు. ఈవిషయమై పోలీసులను సంప్రదించడానికి ప్రయత్నించినా వారు స్పందించలేదు.

భర్తను కిడ్నాప్ చేయించిన భార్య

● పలువురిపై కేసు నమోదు

హుస్నాబాద్, ఏప్రిల్ 6 : భార్య భర్తను కిడ్నాప్ చేయించగా, పలువురిపై కేసు నమోదైన ఘటన శనివారం హుస్నాబాద్‌లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ రోడ్డులో అక్కన్నపేట మండలం నందారం గ్రామానికి చెందిన లింగాల సురేష్, అతని భార్య మాధవి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై ఇద్దరు విడిపోయేందుకు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో శనివారం హుస్నాబాద్‌కు వచ్చిన సురేష్‌ను మాధవితో పాటు మరికొందరు కారులో కిడ్నాప్ చేశారు. సురేష్ తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధవితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీలో రూ.లక్ష పట్టివేత



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చేగుంట, ఏప్రిల్ 6 : ఎన్నికల విధుల్లో భాగంగా చేగుంట పోలీసులు మక్కరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద శనివారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. చేగుంట నుంచి మక్కరాజుపేట వైపు దౌల్తాబాద్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన పశువుల స్వామి బైక్‌పై వెళుతుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. బైక్ ట్యాంకు కవర్‌లో రూ.లక్ష నగదు తీసుకెళుతుండగా, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎస్‌ఐ బాల్‌రాజు సీజ్ చేశారు.

నోళ్లు తెరిచిన బోర్లతో పొంచి ఉన్న ప్రమాదం

నీరుపడని గుంతలను పూడ్చడంపై నిర్లక్ష్యం



మద్దూరు మండలం ధర్మారంలో ఓ రైతు పూడ్చకుండా వదిలేసిన బోరుబావి

మద్దూరు, ఏప్రిల్ 6 : బోరు గుంతలపై నిర్లక్ష్యపు నీడ కమ్ముకున్నది. చుక్కనీరు పడని బోరుబావుల్లో నుంచి కేసింగ్ తీసేసి పూడ్చకుండా వదిలేస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతున్నది. నిబంధనల ప్రకారం రైతులు బోరుబావులను తవ్వాలంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతు భూమిని జియాలజిస్ట్ పరిశీలించి అక్కడ నీరు లభించేది లేనిదీ క్షుణ్ణంగా పరిశీలించాలి. నీరు లభిస్తుందని నిర్ధారిస్తే సర్టిఫికేట్‌తో పాటు చుట్టుపక్కల రైతుల బోరుబావులకు కనీసం 250 మీటర్ల దూరంలో కొత్త బోరుబావిని తవ్వేందుకు అనుమతినిస్తారు. మద్దూరు మండలంలో రైతులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారంగా బోర్‌వెల్ యంత్రాలతో సుమారు 300 నుంచి 500 అడుగులపైనే బోర్లు వేసేస్తున్నారు.

మద్దూరు మండలం ధర్మారం గ్రామంలో ఓ రైతు గతేడాది వ్యవసాయభూమిలో బోరు వేశారు. నీళ్లు పడకపోవడంతో పూడ్చకుండా వదిలేశారు. మనుషులతో పాటు పశువులు ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడి, జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. చాలామంది రైతులు నీరు వస్తే సరేసరి లేదంటే కేసింగ్ తీసేస్తున్నారు. అదే సమయంలో ఆ గుంతను పూడ్చకుండా వదిలేస్తుండటంతో ప్రమాదకరంగా మారుతోంది. నోళ్లు తెరిచిన బోరుబావులు ఉండకూడదన్న జిల్లా అధికారుల ఆదేశాలు మండల స్థాయి అధికారులకు పట్టకపోవడం శోచనీయం. క్షేత్రస్థాయిలో ఆరా తీసి పూడ్చివేయించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. తవ్వి వదిలేసిన బోరుబావుల విషయమై రైతులకు గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాల్సి ఉన్నా ఇక్కడ జరగడం లేదు. రైతులు ఎక్కడెక్కడ ఎన్ని బోర్లు వేస్తున్నారో గ్రామపంచాయతీ అధికారులకు, రెవెన్యూ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ప్రమాదకరంగా మారిన బోరుబావులను ఇప్పటి వరకు ఎన్ని మూసివేశారో లెక్క అధికారులకే తెలియదనే ఆరోపణలున్నాయి. ఇటీవల చాలామంది రైతులు తమ పంటపొలాలు ఎండిపోకుండా ఉండేందుకు బోర్లువేస్తూ భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. చాలాచోట్ల నీరుపడకపోవడంతో వాటిని పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నెలకోమారు పర్యవేక్షిస్తే నిరుపయోగంగా ఉన్న బోరుబావులను గుర్తించవచ్చు. అలాగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

వైభవంగా దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దశంకరంపేటలో దుర్గమ్మ ఆలయం వద్ద ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 6: పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన శనివారం వైభవంగా జరిగింది. ఉదయం తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి దుర్గమ్మతల్లి సంతాననాగేంద్రులు, కేశమ్మ, పాపమ్మ ఆలయాలకు ధ్వజస్తంభం, సింహం, అమ్మవారిపాదుకలు, ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ విగ్రాం వేణుగోపాల్‌గౌడ్ తన తండ్రి రామాగౌడ్ జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మురళీపంతులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో దుర్గామాత వార్షికోత్సవం

నారాయణఖేడ్, ఏప్రిల్ 6: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయ 17వ వార్షికోత్సవాన్ని శనివారం పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సుప్రీకోర్టు న్యాయవాది ఉదయ్‌సాగర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తూప్రాన్ పురాతన శివాలయంలో హోమం

తూప్రాన్, ఏప్రిల్ 6: తూప్రాన్ పట్టణంలోని పురాతన శివాలయంలో హరిహర శంకరాచార్యుల శిష్యులు లోక కల్యాణార్థం శనివారం హోమాది పూజలు నిర్వహించారు. 1996లో శంకరాచార్యులు హైదరాబాద్ నుంచి ధర్మపురి వెళ్లే క్రమంలో తూప్రాన్ శివాలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారని, శిష్యులు తిరవూరి శ్రీరామశర్మ గుర్తుచేశారు. 108 ఆలయాల్లో హోమం, పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

అసంపూర్తి భవనంలో అరకొర వసతులు

చింతమడక బాలికల గురుకులంలో సమస్యల తిష్ట



చింతమడకల గ్రామ శివారులో ప్రహరీ లేని బాలికల గురుకుల విద్యాలయం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 6 : బాలికల గురుకుల పాఠశాలకు సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామ శివారులో రూ.కోటి నిధులతో భవనాన్ని నిర్మించారు. కొత్త భవనం నిర్మించినా విద్యార్థులను పాత సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. అసంపూర్తి భవనంలో అరకొర వసతుల మధ్య విద్యార్థినులు కాలం వెల్లదీస్తున్నారు.

చింతమడకలో భవనం నిర్మించేంతవరకు ఈ పాఠశాల సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల గ్రామ శివారులో గల కపిల్ హోమ్స్‌లో కొనసాగింది. ఫిబ్రవరిలో చింతమడకలోని కొత్త భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఇక్కడ 241 మంది విద్యార్థులు చదువుతున్నారు. భవనం చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. ఏవైనా జంతువులు స్కూల్ భవనంలోకి వస్తాయనే భయంతో విద్యార్థినులు నిద్రపోతున్నారు. తరగతి గదులకు సరిపడే భవనంతో పాటు కిచెన్, డైనింగ్‌హాల్‌కు మాత్రమే గదులు ఉన్నాయి. డార్మెటరీ కోసం గదులు లేకపోవడంతో ప్రస్తుతానికి తరగతి గదులనే డార్మెటరీగా వినియోగిస్తున్నారు. పాఠశాల ఆవరణలో నాలుగు బోర్లు వేసినప్పటికీ అందులో సరిపడా నీరు రావడంలేదు. బోర్ ద్వారా వస్తున్న కొద్దిపాటి నీటినే విద్యార్థినులు అవసరాలకు వినియోగిస్తున్నారు. ప్రతీరోజు తాగు నీరు కొనుగోలు చేస్తున్నారు. వాష్‌రూమ్‌లు సరిపడా లేకపోవడంతో సకాలంలో తరగతులకు హాజరు కాలేకపోతున్నారు.

దేశాభివృద్ధి కోసం బీజేపీకి పట్టం కట్టండి

● మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు
● సంగారెడ్డిలో ఎన్నికల ప్రచారం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6 : దేశాభివృద్ధి, సనాతన ధర్మ రక్షణ కోసం బీజేపీకి ఓటు వేయాలని మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోరారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం ఆరు గంటలకు కలెక్టరేట్ వెనక పార్క్, తారా డిగ్రీ కళాశాల మైదానం, అంబేద్కర్ మైదానంలోని వాకర్స్‌తో కలిసి ముచ్చటించారు. అనంతరం రాంనగర్‌లోని రామాలయం, శ్రీనగర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ప్రచార రథాలతో ఒకటి, రెండు, మూడు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్‌లో బీజేపీ ఎంపీ గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసమే ప్రయత్నిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు తనకు పోటీ కాదని, ఆయా అభ్యర్థులను గుర్తుపట్టే స్థితిలో ప్రజలు లేరన్నారు. ప్రజలు మూడోసారి నరేంద్రమోదీని పట్టాభిషేకం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, సంగమేశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, హన్మంత్‌రెడ్డి, డా.రాజుగౌడ్, అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని శ్రీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

'ఇస్రో యూనిక'కు గజ్వేల్ విద్యార్థిని ఎంపిక



హరిత

గజ్వేల్, ఏప్రిల్ 6: గజ్వేల్ సెయింట్ మేరీస్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని మొగిలి హరిత 'ఇస్రో యూనిక'కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరిలో నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఇస్రో యూనికకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికవగా, తమ పాఠశాలకు చెందిన హరిత ఎంపికవడం హర్షణీయమని కరస్పాండెంట్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇస్రో ఆధ్వర్యంలో మే 13 నుంచి 24వరకు హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో అవగాహనతో పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని మొగిలి హరితను ప్రిన్సిపల్ జయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

● మెదక్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 6: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. టేక్మాల్, రేగోడ్, పెద్దశంకరంపేట మండలం తిర్మలాపూర్, చేగుంట మండలం వడియారం, రామాయంపేట మండలం కోమట్‌పల్లి, చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాల, నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి జడ్పీ పాఠశాల, జక్కపల్లి మోడల్ స్కూల్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. 6, 7, 8, తరగతుల్లో ప్రవేశానికి 3,352 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

400 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● హైదరాబాద్ నుంచి నాందేడ్‌కు రవాణా
● తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడి



తూప్రాన్ వద్ద పట్టుబడిన బియ్యం లారీ

తూప్రాన్, ఏప్రిల్ 6 : భారీ ఎత్తున రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజామున విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కె.ద్రోణాచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాందేడ్ (మహరాష్ట్ర)కు లారీలో రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. దాంతో తూప్రాన్ పోలీసులను అప్రమత్తం చేయగా, శనివారం తెల్లవారుజామున రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టుబడింది. లారీలో 400 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయి. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని నవదుర్గా రైస్‌మిల్లులో నిల్వ చేశారు. రేషన్ బియ్యం రవాణా చేస్తున్న నిందితుల వివరాల కోసం విచారిస్తున్నారు. దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ తహసీల్దారు ప్రభాకర్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరామ్, డిప్యూటీ తహసీల్దారు సాధక్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో 14.5 క్వింటాళ్లు..

దౌల్తాబాద్, ఏప్రిల్ 6 : అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులులు, దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల కేంద్రంలో పులుగారి ప్రశాంత్‌గౌడ్ షాపులో అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు, దౌల్తాబాద్ పోలీసులతో కలిసి దాడి చేశారు. 14.5 క్వింటాళ్ల పీడీఎస్ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. దుకాణాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణా చేసిన, నిల్వ ఉంచిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

అంకిరెడ్డిపల్లి వద్ద యాభై క్వింటాళ్లు..

రాయపోల్, ఏప్రిల్ 6 : టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసులు ఎన్ని దాడులు చేస్తున్నప్పటికీ రేషన్ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున రాయపోల్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్‌ఐ రఘుపతి, రెవెన్యూ అధికారి భానుప్రకాశ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అంకిరెడ్డిపల్లి వద్ద నిలిపి ఉన్న గూగులోత్ అశోక్‌కు చెందిన బొలెరో వాహనం కనిపించింది. ఈ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను పోలీసులు విచారించగా యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెల్దుర్తి గ్రామం నుంచి బొలేరో వాహనంలో తరలిస్తున్న 52 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బియ్యాన్ని దౌల్తాబాద్ ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు.


సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి


కల్హేర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు


మెదక్ అర్బన్: జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

ప్రధాని మోదీ నేతృత్వంలో వికసిత్ భారత్

- **బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**
- **ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం**

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6: మోదీ నేతృత్వంలో వికసిత్ భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మెదక్ ఎంపీ అభ్యర్థి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●కల్హేర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కల్హేర్‌లో శనివారం బీజేపీ జెండాను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా నాయకుడు ఎం.విజయపాల్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎన్నం అనిల్‌రెడ్డి, రాష్ట్ర మాజీ కౌన్సిల్ మెంబర్ కరణం సంగమేశ్వర్‌రావ్ పాల్గొన్నారు. మండల పరిధిలోని క్రిష్టాపూర్, రాపర్తి, బీబీపేట్‌లలో కూడా బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

●జిన్నారం: సోలక్‌పల్లిలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

●మునిపల్లి: మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు ఉపేందర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

●నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బీజేపీ కార్యాలయంతో పాటు 1,2,3,4 బూతుల్లో ఖేడ్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ రజనీకాంత్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ఓబీసీ రాష్ట్ర నాయకులు సాయిరాం, ఎస్సీ మోర్చా నాయకులు సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి సతీష్‌కుమార్ జెండాలు ఆవిష్కరించారు.

●నాగల్‌గిద్ద: నాగల్‌గిద్ద మండల కేంద్రంతో పాటు కరస్‌గుత్తి, గొందెగాం, దామర్‌గిద్ద తదితర గ్రామాల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌పటేల్, సీనియర్ నాయకుడు, యువమోర్చా అధ్యక్షుడు రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

●పుల్‌కల్: పుల్కల్ మండలంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, మండలాధ్యక్షుడు పండరి పాల్గొన్నారు.

●జహీరాబాద్: జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో, జహీరాబాద్ పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

మెదక్ జిల్లాలో

●మెదక్ అర్బన్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్‌పటేల్, అసెంబ్లీ కన్వీనర్ మధు తదితరులు పాల్గొన్నారు.

●హవేళిఘణపూర్: మండల కేంద్రమైన హవేళిఘణపూర్‌లో కార్యాలయం వద్ద పార్టీ మండలాధ్యక్షుడు రంజిత్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు.

●టేక్మాల్: మండల కేంద్రంలో బీజేపీ జెండాను పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, యువమోర్చా అధ్యక్షులు పవన్ పాల్గొన్నారు.

●అల్లాదుర్గం: అల్లాదుర్గంలోని పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ జెండాను మండలాధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకుడు కాళ్ల రాములుతో కలిసి ఆవిష్కరించారు.

●రేగోడు: రేగోడులో బీజేపీ ఆవిర్భావ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సంగమేశ్వర్, లక్ష్మణ్, దొండి రావు, బీజేవైఎం అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

●పెద్దశంకరంపేట: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పెద్దశంకరంపేటలో బీజేపీ కార్యాలయం వద్ద జరుపుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


పెద్దశంకరంపేటలో బీజేపీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్

●తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు భూమన్నగారి జానకీరాంగౌడ్ జెండాను ఆవిష్కరించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి పృథ్వీగౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

●వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ సత్యనారాయణ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలోని పర్కిబండ, కాళ్లకల్, రామాయపల్లిలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి, నాగరాజు, ఐలయ్య, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●చేగుంట: చేగుంట మండలంలో బీజేపీ మండలాధ్యక్షుడు చింతల భూపాల్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఆధ్వర్యంలో బిజెపి జెండా ఎగురవేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●వట్‌పల్లి: మండల పరిధిలోని దేవునూరు, దుద్దాల, సాయిపేట తదితర గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు సురేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

●చిలప్‌చెడ్: చిలప్‌చెడ్ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శివకుమార్‌గౌడ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్ వేసుకునే అవకాశం: కలెక్టర్ క్రాంతి


మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: సువిధ పోర్టల్ ద్వారా అభ్యర్థులు నామినేషన్ వేసుకునే అవకాశం కల్పించినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి జాతీయ, రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందిన పార్టీ తరఫున పోటీచేస్తే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని 18 నుంచి 25 వరకు అందించవచ్చన్నారు. ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951లోని సెక్షన్ 34 పార్లమెంట్ సభకు జరిగే ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా రూ.25వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు శేఖ్ తాహేర్, సీపీఎం మాణిక్యం, బీజేపీ సందీప్‌గౌడ్, బీఎస్పీ వినోద్‌కుమార్, ఎంఐఎం ఫాజిల్ ఇర్ఫాన్, బీఆర్ఎస్ పరశురామ్ వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


వాణి(ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 6: యువతి అదృశ్యమైన సంఘటన చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో శనివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మాసాయిపేట నర్సింహులు కూతురు వాణి(20) శనివారం తెల్లవారుజామున ఇంట్లోంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా రుక్మాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉన్నదని యువతి తండ్రి నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజ్ వెల్లడించారు.

నిబంధనలు పాటించని కాలేజీల గుర్తింపు రద్దు చేయండి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఈ విషయమై కలెక్టరేట్‌లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ హాస్టల్ విభాగ్ కన్వీనర్ తానాజీ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ఇతర ప్రైవేటు కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శశాంక్, దినేశ్, నిఖిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

చిలప్‌చెడ్, ఏప్రిల్ 6: అడవి పంది దాడిలో మృతిచెందిన వ్యక్తి కుటుంబీకులకు శనివారం జిల్లా ఫారెస్ట్ అధికారులు తమ కార్యాలయంలో రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేశారు. రెండునెలల క్రితం మండలం పరిధిలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన పన్యాల శంకరయ్య పొలంలో పనిచేస్తున్న క్రమంలో అడవిపంది అకస్మాత్తుగా మీద పడి దాడిచేసింది. అతడిని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా శనివారం జిల్లా ఫారెస్ట్ అధికారులు ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందజేశారు. వాటిలో రూ.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా.. రూ.2.5 లక్షలు మృతుడి కుమారుడు పోచయ్యకు, మరో రూ.2.5 లక్షలు కుమార్తె నిర్మలకు అందజేసినట్లు తెలిపారు.

భీమయ్య మృతిపై క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణ

వెల్దుర్తి, ఏప్రిల్ 6: రెండురోజుల క్రితం మండల పరిధిలోని మంగళపర్తి గ్రామానికి చెందిన మంగళి భీమయ్య చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అయితే భీమయ్య మృతిపై అనుమానం ఉన్నదని భార్య పెంటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శనివారం ఉదయం తూప్రాన్ సీఐ కృష్ణ, క్లూస్ టీమ్ బృందం ఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించారు.

తూప్రాన్ పట్టణంలో ఇఫ్తార్ విందు

- **హాజరైన ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

తూప్రాన్, ఏప్రిల్ 6: తూప్రాన్ పట్టణ జామై మసీదులో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. తూప్రాన్ బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షుడు బురాన్ ఆధ్వర్యంలో జామై మసీదులో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇందులో మైనారిటీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలి: రాజిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 6: శివపార్వతుల దీవెనలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బస్వాపూర్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి రాజిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు సుహాసినిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మొగుడంపల్లి జడ్పీటీసీ

జహీరాబాద్, ఏప్రిల్ 6: మొగుడంపల్లి జడ్పీటీసీ అరుణామోహన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ, ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ నరేంద్రమోదీ పథకాలతో ప్రజలకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం జడ్పీటీసీ అరుణామోహన్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీజేపీలో చేరానని స్పష్టం చేశారు.

పేదల గుడిసెలపైనా మీ ప్రతాపం: సీపీఎం

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న పెద్దలను వదిలి గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలపై రెవెన్యూ అధికారులు ప్రతాపం చూపించడం విడ్డూరమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. సంగారెడ్డిలో డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మికి శనివారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలోని ఎర్రకుంటలో పేదల గుడిసెలను రాత్రికిరాత్రి కూల్చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, సాయిలు, నాయకులు ఉన్నారు.

శాంతి స్వరూప్‌కు మెదక్‌తో అనుబంధం


లిటిల్ ఏంజిల్స్ స్కూల్లో 32 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఓ సమావేశానికి విచ్చేసిన శాంతి స్వరూప్(ఫైల్)

మెదక్, ఏప్రిల్ 6: ప్రఖ్యాత టీవీ వ్యాఖ్యాత, దూరదర్శన్ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ 32 ఏళ్ల క్రితం మెదక్ పట్టణానికి విచ్చేశారు. అప్పట్లో ఏకైక ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ స్కూల్‌డే సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాటి కార్యక్రమంలో పాల్గొన్న వారు ఇప్పుడు ఆయన లేరన్న విషయం తెలిసి నాటి రోజులను నెమరువేసుకుంటున్నారు.

జనజాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


నర్సాపూర్ నుంచి డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం కాంగ్రెస్ నిర్వహించిన జన జాతర సభకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు వివిధ వాహనాల్లో బయలుదేరివెళ్లాయి. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

సమాచారం

అక్రమ మద్యం బాటిళ్లు సీజ్

కొల్చారం: అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ తెలిపారు. కొల్చారం మండలం దుంపలకుంట చౌరస్తాలో చేకూరి సత్తయ్యకు చెందిన కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం మేరకు దాడులు నిర్వహించి, 15 క్వాటర్లు, ఐదు బీర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్లు దుకాణాలు, బెల్టుషాపులపై దాడులు

కొల్చారం: కొల్చారం మండల పరిధిలోని ఎనగండ్ల, రంగంపేటలో బెల్ట్ షాపులపై శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. రంగంపేటలో ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు రూ.2.50 కోట్లు: ఎమ్మెల్యే


ఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 6: ఖేడ్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రభుత్వం రూ.2.50 కోట్లను కేటాయించినట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం పేరిట అప్పటికే ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను నిర్లక్ష్యం చేసిందన్నారు. గత వర్షాకాలంలో తక్కువ వర్షాపాతంతో పాటు ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత బాగా పెరగడంతో భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయన్నారు. ముందు జాగ్రత్త చర్యగా పాత పైప్‌లైన్లకు మరమ్మతులు చేయించామని పేర్కొన్నారు. బోరంచ, గూడురు పాతనీటి పథకాలకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు సిద్ధం చేసి ఉంచామన్నారు. శాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేయిస్తే 22 గ్రామాలకు, 24 గంటలు నీటిని సరఫరా చేసే అవకాశం ఉన్నందున మరమ్మతులకు రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ఎన్నికల కోడ్ కారణంగా నిధులు మంజూరు కాలేదని తెలిపారు. గౌరికల్‌లో ఖేడ్ వైపు నీటి సరఫరాకు సంబంధించి లో ఓల్టేజీ సమస్య ఉండగా.. మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిష్కారానికి ప్రతిపాదనలు పంపారన్నారు. అవసరమైతే నెలకు రూ.6 వేల చొప్పున చెల్లిస్తూ ప్రైవేటు బోర్లను అద్దెకు తీసుకుని నీటి సమస్య లేకుండా చూసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, న్యాయవాది సంగన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే రైతులకు కష్టాలు


నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునితారెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష


జోగిపేటలో బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న క్రాంతికిరణ్

నర్సాపూర్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ నాలుగు నెలల అసమర్థ పాలన వల్లే రైతులు అనేక కష్టాలు పడుతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి విమర్శించారు. శనివారం పార్టీ అధిష్టానం పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో కాంగ్రెస్ వైఫల్యాలపై ఆమె ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సునితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోని వ్యవసాయ రంగం దారుణంగా మారిందన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం, అవగాహనారాహిత్యమే కారణమని పేర్కొన్నారు. రైతుకు భరోసా కల్పించేందుకు మాజీ సీఎం కేసీఆర్ ఎండను సైతం లెక్క చేయకుండా రైతుబాట పట్టారన్నారు. రైతులు కుంగిపోవద్దని, తాము అండగా ఉండి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్‌అశోక్‌గౌడ్, ఎంపీపీలు హరికృష్ణ, నర్సింహులు, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని రాష్ట్ర ప్రభుత్వం: క్రాంతికిరణ్

జోగిపేట, ఏప్రిల్ 6: రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ దుయ్యబట్టారు. కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం జోగిపేటలోని అంబేడ్కర్ కూడలి వద్ద క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టాయి. ఈ ధర్నాలో క్రాంతికిరణ్ ప్రసంగిస్తూ.. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజల, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా రైతుల పంటలు ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీ.నారాయణ, హెచ్.రామగౌడ్, లక్ష్మీకాంత రెడ్డి, డీబీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

- **మెదక్ డీఎస్పీ రాజేష్**

రేగోడు/వెల్దుర్తి, ఏప్రిల్ 6: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మెదక్ డీఎస్పీ రాజేష్ హెచ్చరించారు. శనివారం రేగోడ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని, పార్టీ సమావేశాలకు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ప్రయాణంలో రూ.50 వేలకు మించి డబ్బులు దొరికితే సీజ్ చేస్తామని, సరైన పత్రాలు ఉంటే వదిలేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజయ్య, ఏఎస్‌ఐ మల్లయ్య సిబ్బంది చిట్టిబాబు పాల్గొన్నారు.


ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నర్సాపూర్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ కరుణాకర్ అన్నారు. శనివారం వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. గమనించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఎగరేసిన జెండాను తొలగించి మాట్లాడారు. ఆయన వెంట వెల్దుర్తి మండల ఎన్నికల ప్రవర్తన నియమావళి టీమ్ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు ఉన్నారు.


సీనియర్ సిటిజన్స్.. ఉచిత వైద్య సేవలు పొందండి


- **జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు**


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 6: సీనియర్ సిటిజన్స్. ఉచిత వైద్య సేవలు పొందాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు కోరారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని వెల్‌నెస్ హాస్పిటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెలాఖరు వరకు ఓపీ ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా గ్రామాల్లో హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఆయన ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్‌నెస్ ఆస్పత్రి ఎండీ డా.లలేష్, హెచ్‌ఆర్. డేవిడ్, డాక్టర్లు రాజేందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వసురాంతండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు పీడీ సరస్వతి


చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెదక్ డీపీఎం మోహన్


కాయిదంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శంకర్‌యాదవ్

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కొల్చారం, ఏప్రిల్ 6: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు పీడీ సరస్వతి, డీపీఎంఐపీ జానకి, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు అన్నారు. కొల్చారం మండల పరిధిలోని వసురాంతండాలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఏపీఎం దేవ సునిల్వ, సీసీ వెంకటేశం, కవిత, మౌనిక, అధ్యక్షురాలు యశోద పాల్గొన్నారు. అలాగే సంగాయిపేటలో మంజీరా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరత్నం, ఏఈవో నిరోషా, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ప్రారంభించారు.

●చేగుంట: చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లి, అనంతసాగర్, వడియారం, చిన్న శివనూర్, ఇబ్రహీంపూర్, రాంపూర్, మక్కరాజుపేట్, పోతాన్‌పల్లి, బోనాల, కొండాపూర్, చందాయిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మెదక్ జిల్లా డీపీఎం మోహన్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ గియాఉన్నిసాబేగం ప్రారంభించారు.

●అల్లాదుర్గం: మండలంలోని కాయిదంపల్లి సీతానగర్, రాంపూర్, గడిపెద్దాపూర్ తదితర గ్రామాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో శంకర్‌యాదవ్ ఐకేపీ అధికారులతో కలిసి ప్రారంభించారు.

●పెద్దశంకరంపేట: మండల పరిధిలోని కమలాపూర్, జమ్మికుంట, కొత్తపేట్, బుజ్రాన్‌పల్లి, జూకల్, బూర్గుపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం గోపాల్ శనివారం ప్రారంభించారు.

●నర్సాపూర్: మండలంలోని చిన్నచింతకుంట, మంతూరు, మహ్మదాబాద్, గూడెంగడ్డ, తుల్జారాంపేట గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్ తెలిపారు. సీసీలు ప్రవీణ పాల్గొన్నారు.

●తూప్రాన్: తూప్రాన్ మండలంలోని మల్కాపూర్, గుండ్రెడ్డిపల్లి, ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, ఘనపూర్, యావాపూర్, వట్టూరు, కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను కార్యదర్శులు ప్రారంభించారు.

●వెల్దుర్తి: మండల పరిధిలోని అక్కంపల్లి, శేరి, మహమ్మద్‌నగర్‌తండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు సత్యం, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.

●మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలోని పర్కిబండ, కూచారం, లింగారెడ్డిపేట్, రంగాయపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

●వట్‌పల్లి: మండలంలోని ఖాదిరాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు సీఈవో శ్రీకాంత్ తెలిపారు.

●చిలప్‌చెడ్: మండలం పరిధిలోని సిలాంపల్లి, గంగారం, సోమక్కపేటలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీఎం ప్రేమలత, పీఏసీఎస్ సీఈవో పోచయ్య పేర్కొన్నారు.